ఆహ్లాదం ఆనందం



లాసన్స్ బే పార్కులో సముద్రతీరం వైపు సేద తీరుతున్న సందర్శకులు



ఆధునాతనంగా బృందావనం పార్కు ముఖద్వారం



ఆధునికీకరించిన శివాజీపార్కు లోపలి ప్రాంతం

- ఎంవీపీ కాలనీలో సుందరంగా పార్కులు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.కోట్లతో అభివృద్ధి
- శివాజీపార్కు, బృందావనం, లాసన్స్ బే పార్కులకు కొత్త శోభ
- వేడుకలు, ఫొటోషూట్‌లకు వేదికగా నిలుస్తున్న వైనం
- ప్రశాంతంగా సేద తీరుతున్న నగర వాసులు, పిల్లలు



లాసన్స్ బే కాలనీ పార్కులో ఆహ్లాదంగా గడుపుతున్న చిన్నారులు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ 17, 19వ వార్డుల్లో ఆధునికీకరించిన పార్కులు నగర వాసులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. నగర ప్రజల అవసరాలు దృష్ట్యా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జీవీఎంసీ స్మార్ట్‌సిటీ విభాగం తూర్పు నియోజకవర్గంలో పలు పార్కులు సర్వాంగసుందరంగా తీర్చిదిద్దింది. దశాబ్దాలుగా ఆధునికీకరణకు నోచుకొని పార్కులకు సొబగులు అద్ది కొత్త శోభ తీసుకొచ్చింది. దీంతో 17వ వార్డులోని శివాజీ పార్క్‌తోపాటు 19వ వార్డులోని లాసన్స్ బే కాలనీ పార్క్, బృందావనం పార్కులు నియోజకవర్గం, నగర ప్రజలకు నిత్యం ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు సౌకర్యాలు కల్పిస్తున్నాయి. వేడుకలతోపాటు ఫొటో షూట్‌లకు నిలయంగా నిలుస్తున్నాయి.

ఆకర్షణీయంగా థీమ్ పార్కు

పిల్లల నుంచి పెద్దలు, వృద్ధుల వరకు అందరికీ ఆహ్లాదాన్ని పంచే విధంగా ఎంవీపీ కాలనీ సెక్టార్ – 11లో బృందావనం థీమ్ పార్కులో సౌకర్యాలు కల్పించారు. అన్ని వయసుల వారికి ఉపయోగకరంగా ఉండే విధంగా ఓపెన్ వ్యాయామ శాల, షటిల్ కోర్టు, ముగ్గురం ట్రాక్, ప్లెస్ ఆకారంలో ఆహ్లాదకరంగా ఇంటర్ లాకింగ్ టైల్స్, సందర్శకులు సేద తీరేందుకు భారీ వృక్షం చుట్టూ ఏర్పాటు చేసిన అధునాతన ట్రీ బెంచ్, ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు వృద్ధుల కోసం వెయిటింగ్ హాల్ ఆధునికీకరణ, చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన అధునాతన చిల్డ్రన్ ప్లే ఏరియాతోపాటు డెకరేటివ్ లైటింగ్ పోల్స్, గ్రిల్‌తో కూడిన కాంపౌండ్ వాల్ వంటి సకల సౌకర్యాలు ఈ పార్క్‌లో కల్పించారు. దీంతో ఈ పార్క్ ఆ ప్రాంత వాసులకు నిత్యం ఆహ్లాదాన్ని పంచుతోంది.

లాసన్స్ బే పార్కులో సౌకర్యాలు

లాసన్స్ బే పార్కులో వ్యర్థ టైర్లతో చిన్నారుల ప్లే ఏరియాను జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తీర్చిదిద్దింది. రూ.36 లక్షలతో పలు నూతన సౌకర్యాలను సైతం అందుబాటులోకి తెచ్చారు. స్థానిక ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వీటిని తీర్చిదిద్దారు. వాకర్స్ యోగా చేసుకోవడానికి అనుగుణంగా ప్రత్యేక మండపాన్ని, సేద తీరడానికి ప్రత్యేక షెడ్డును నిర్మించారు. దీంతోపాటు వాహనాలు పార్కులోకి వెళ్లకుండా అధునాతన గేట్‌లను నిర్మించారు. దీంతో ఈ పార్కులో సాయంత్రం పూట స్థానికులు వాకింగ్ చేయడంతోపాటు సముద్రతీరాన్ని చూస్తూ సేద తీరుతున్నారు.



శివాజీ పార్కులో ఆహ్లాదకరంగా ఫౌంటైన్ సముదాయం

ఫొటోషూట్స్, వేడుకలకు శివాజీ పార్కు

దశాబ్దాలుగా ఆధునికీకరణకు నోచుకోని శివాజీ పార్కును గత ప్రభుత్వంలో జీవీఎంసీ పూర్తి స్థాయిలో ఆధునికీకరించింది. రూ.1.5 కోట్లతో పార్కులో అభివృద్ధి పనులు చేపట్టారు. పార్కు ముఖద్వారం ఆధునికీకరణ, ఫ్లోరింగ్, సెంటర్ ప్లాజా, ఫొటో షూట్ పాయింట్ ఆధునికీకరణ, టైల్స్ నిర్మాణం, పెయింటింగ్స్, లైటింగ్ ఏర్పాటు చేశారు. దీంతోపాటు మెయిన్ టాయిలెట్స్, క్యాంటీన్ టాయిలెట్స్ రిపేర్, ప్లంబింగ్, పెయింటింగ్ పనులు నిర్వహించారు. వాకింగ్ ట్రాక్‌పై గుంతలు లేకుండా మరమ్మతులు చేశారు. జిమ్, చిల్డ్రన్ ప్లే ఏరియాను ఆధునికీకరించారు. దీంతోపాటు రూ.50 లక్షలతో దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన ఫౌంటైన్‌లను సుందరంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. దీంతో ఈ పార్కు ప్రస్తుతం అనేక వేడుకలకు, ఫొటో షూట్‌లకు వేదికగా నిలుస్తోంది.

క్లుప్తంగా

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వద్దు



విశాలాక్షినగర్‌లో పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న జెడ్సీ కనక మహాలక్ష్మి

ఆరిలోవ : జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి విశాలాక్షినగర్‌లో జోన్ – 2 జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి గురువారం పర్యటించారు. పరిసరాలు, వీధుల్లో పారిశుధ్యం నిర్వహణను పరిశీలించారు. వార్డులో ఎంత మంది పారిశుధ్య కార్మికులున్నారు..?, వారంతా రోజూ విధులకు సకాలంలో హాజరవుతున్నారా..? తదితర వాటిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీని ఆరా తీశారు. అనంతరం ఆమె పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. పారిశుధ్యం నిర్వహణపై అలసత్వం వహించొద్దని కార్మికులకు తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం విధిగా భావించాలని సూచించారు. కాలువలు, రోడ్లు శుభ్రం చేయడంతోపాటు ఇళ్లలో తడి, పొడి చెత్త సేకరణ నిరంతర ప్రక్రియ అని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

క్రీడాకారుల జెర్సీ ఆవిష్కరణ



జెర్సీ ఆవిష్కరిస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ : వీఎంఆర్డీఏ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ నెల 9 నుంచి స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. గురువారం వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొనే ఉద్యోగులకు అందించే జెర్సీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ క్రీడా ఉత్సవంలో క్రికెట్, వాలీబాల్, చెస్, క్యారమ్స్, బ్యాడ్మింటన్ వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీటిలో వీఎంఆర్డీఏలోని అన్ని విభాగాల నుంచి సుమారు 200 మంది ఉద్యోగులు పాల్గొంటారని వెల్లడించారు. ఉద్యోగులకు ఆట విడుపుగా ఈ క్రీడా ఉత్సవాన్ని నిర్వహించడం ద్వారా వారు మరింత ఉత్సాహంగా పనిచేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మురళీకృష్ణ, వీఎంఆర్డీఏ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు వెంకటేశ్వరరావు, రవికుమార్, ప్రసాద్, హేమంత్, ఈశ్వరరావు, రాము, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బాలుర గృహాలకు వితరణ



ఆరిలోవ : చినగదిలి ప్రాంతం దీన్‌దయాల్‌పురంలో ప్రభుత్వ బాలుర గృహాలకు పినాకిల్ ఆస్పత్రి సీఎస్ఆర్ నిధులతో సహకారం అందించింది. ఇక్కడి ప్రభుత్వ బాలుర గృహంతోపాటు ప్రభుత్వ పరిశీలనా గృహానికి వేర్వేరుగా 160 ఏహెచ్ బ్యాటరీలు, ఫ్లడ్ లైట్లు, ఇనుప అలమరాలు, 12 అంగుళాల ఎగ్జాస్ట్ ఫ్యాన్లను పినాకిల్ ఆస్పత్రి ప్రతినిధులు ఆయా గృహాల సూపరింటెండెంట్లకు గురువారం అందించారు. కార్యక్రమంలో బాలుర గృహం, పరిశీలనా గృహాల సూపరింటెండెంట్లు రమణ, షణ్ముఖరావు, పినాకిల్ సీనియర్ మేనేజర్ మణిరాజు, సెక్రటరీ సోని పాల్గొన్నారు.

వైభవంగా ఆర్జిత సేవలు



స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆశీనులను చేసి కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

శరవేగంగా శాస్త్ర విజ్ఞాన రంగం అభివృద్ధి



ప్రసంగిస్తున్న డీఎస్‌సీ పూర్వ కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్

మద్దిలపాలెం : శాస్త్ర విజ్ఞాన రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని డీఎస్‌సీ పూర్వ కార్యదర్శి డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఆచార్య ఇ.వెంకట్రావు ఎండోమెంట్ లెక్చర్‌లో ఆయన ప్రసంగించారు. ముందుగా ఆచార్య ఇ.వెంకట్రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలు సమాజంలో విశిష్ట గుర్తింపు పొందుతున్నారన్నారు. మానవ సంక్షేమంతోపాటు ప్లానెట్‌ని సంరక్షించుకునే దిశగా ప్రతి వ్యక్తి ఆలోచించాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక విశ్వవిద్యాలయాల్లో వృద్ధాప్యాన్ని నియంత్రించే పరిశోధన జరిపే విభాగాలను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా మరణాలు సంభవించడానికి కారణమవుతున్న వ్యాధులను, కారకాలను తెలియజేశారు. సముద్రం నుంచి ఉత్పత్తి అవుతున్న ఔషధాలను వివరించారు. భవిష్యత్‌లో మనం ధరించే వస్త్రాలు, గ్రీన్ టెక్నాలజీ, స్మార్ట్ హౌసెస్ వంటి విభిన్న అంశాలను వివరించారు. ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో 30కి పైగా ఎండోమెంట్ లెక్చర్స్ ఉన్నాయని, వాటిని సంబంధిత విభాగాల్లో నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య గిరిజ శంకర్, విభాగ ఆచార్యులు, విశ్రాంత ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన బోరు ప్రారంభం



పూజ చేసి బోరు ప్రారంభించిన కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, సురేష్

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 20వ వార్డు పరిధి చినవాల్తేరు రజక వీధిలో ప్రజలకు సరైన నీటి సదుపాయం లేకపోవడంతో గురువారం కొత్త బోరు వేశారు. ఈ మేరకు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, సురేష్ నూతన బోరుకు పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జీవీఎంసీ సూపర్‌వైజర్ శంకర్‌రావు, నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ కాగితాల రవికిరణ్ రెడ్డి, వార్డు యూత్ ప్రెసిడెంట్ గుర్రల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు తరలించేందుకు చర్యలు చేపడతాం



పాత పోలీస్ స్టేషన్ వెనుక వాహనాలు పరిశీలిస్తున్న జెడ్సీ కనక మహాలక్ష్మి

ఆరిలోవ : ఆరిలోవలో పాత పోలీస్ స్టేషన్ వెనుక ఆవరణలో నిల్వ చేసిన వాహనాలు కొత్త పోలీస్ స్టేషన్ ఆవరణలోకి తరలించేందుకు చర్యలు చేపడతామని, ఈ విషయంపై ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావుతో మాట్లాడతామని జోన్ – 2 జెడ్సీ కనక మహాలక్ష్మి తెలిపారు. పోలీసులు దొంగల నుంచి పట్టుకొన్న వాహనాలు, రోడ్డు ప్రమాదానికి గురైన వాహనాలను పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో కొన్నేళ్లుగా నిల్వ చేశారు. వీటి వల్ల ఇక్కడ ఉన్న మూడు సచివాలయాలకు ప్రజలు వెళ్లడానికి దారి మూసుకుపోయింది. దీంతో ప్రజలు పనుల కోసం సచివాలయాలకు వెళ్లి రావడానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆరిలోవ సందర్శనలో భాగంగా ఆమె గురువారం పాత పోలీస్ స్టేషన్ వెనుక పాడైన వాహనాలను పరిశీలించారు. వాటిని కొత్త పోలీస్ స్టేషన్ ఆవరణకు తరలించే విధంగా పోలీసులతో చర్చిస్తానని తెలిపారు. వాటిని తరలించి సచివాలయాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపడతామన్నారు. దీని ఆవరణలో మధ్యలో నిలిచిపోయిన సామాజిక భవన నిర్మాణం పరిశీలించి పనులు పూర్తిచేసేలా అధికారులతో మాట్లాడతానన్నారు. ఈ సందర్శనలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన ఎంవీపీ రైతు బజార్



వినియోగదారులతో కిటకిటలాడుతున్న ఎంవీపీ రైతు బజార్



పువ్వుల స్టాల్ వద్ద వినియోగదారుల రద్దీ

- భారీగా వరలక్ష్మీ వ్రతం పూజా సామగ్రి విక్రయాలు
- పువ్వులు, గ్రామీణ ఉత్పత్తులకు మంచి గిరాకీ

ఎంవీపీ కాలనీ : శ్రావణమాసం వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని పురస్కరించుకుని ఎంవీపీ రైతు బజార్ కిటకిటలాడింది. గురువారం పూజా సామగ్రి కొనేందుకు వినియోగదారులు పోటెత్తారు. దీంతో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎంవీపీ రైతు బజార్‌లో వినియోగదారుల రద్దీ కొనసాగింది. రద్దీని దృష్టిలో ఉంచుకొని బజార్ అధికారులు ఏర్పాట్లు చేయడంతో విక్రయాలు సజావుగా జరిగాయి. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని పువ్వులు, పలు రకాల పండ్లు, పత్రాలు, గ్రామీణ ఉత్పత్తులను వినియోగించే విషయం తెలిసిందే. దీంతో వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా పూజా సామగ్రిని రైతులు భారీ ఎత్తున బజార్‌కు తీసుకొచ్చి విక్రయించారు. కొబ్బరికాయలు, సీతాఫలం, జామ, వెలగ, బత్తాయి, దానిమ్మ, మారేడు, అరటి పండ్లు గుట్టలుగా పోసి విక్రయించారు. దీంతోపాటు వివిధ రకాల పువ్వుల విక్రయాలు సైతం జోరుగా సాగాయి. ప్రస్తుతం పువ్వుల ధరలు అధికంగా ఉన్నప్పటికీ పండగ దృష్ట్యా వినియోగదారులు కొనుగోలు చేశారు. ఆయా విక్రయాలు కారణంగా గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎంవీపీ రైతు బజార్ వినియోగదారులతో కిటకిటలాడింది.

వైఎస్సార్‌సీపీ పాలనలో మత్స్యకారులకు ప్రాధాన్యం

- నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు



ప్రజలకు ప్రభుత్వ మోసాలు వివరిస్తున్న మువ్వల సురేష్, నాయకులు



కరపత్రాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, నాయకులు

ఎంవీపీ కాలనీ : వైఎస్సార్‌సీపీ పాలనలో మత్స్యకారుల అభివృద్ధికి, అభ్యున్నతికి పెద్దపీట వేశామని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. జీవీఎంసీ 19వ వార్డు పార్టీ అధ్యక్షుడు సూరాడ దాసు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేసిందన్నారు. వేట విరామ సమయంలో ఆర్థిక సాయం అందించి మత్స్యకార కుటుంబాలకు అండగా నిలిచారని గుర్తు చేశారు. ప్రమాదాల సమయంలో అవసరమైన తక్షణ సాయం అందించడంతోపాటు 10 ఫిషింగ్, సరకు రవాణా హార్బర్ల నిర్మాణం చేపట్టారన్నారు. మత్స్యకారులకు అనేక పథకాలు అమలు చేశారన్నారు. గతంలో మాదిరిగా మత్స్యకారులకు సంక్షేమ ఫలాలు అందాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రభుత్వం చేసిన మోసాలతో కూడిన కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ వార్డు ఉపాధ్యక్షుడు వాడమొదుల గణేష్, మహిళ విభాగం అధ్యక్షురాలు బహర వసంత, యూత్ అధ్యక్షుడు నొల్లి గణేష్, ఓలిశెట్టి శ్రీనివాస్, వాడమొదుల లక్ష్మీ, తెడ్డు జంపన్న, సాల్మన్‌రాజు, అభిలాష్, గుర్నాథ్, శ్రీను, సత్తిరాజు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలు విస్మరించింది

బీచ్‌రోడ్డు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్నప్పటికీ వారు మేనిఫెస్టోలో చెప్పిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్ ఆరోపించారు. జీవీఎంసీ 20వ వార్డులో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత హామీలను ప్రజలకు వివరించారు. కూటమి నాయకులు గడప గడపకు వెళ్లి అబద్ధపు హామీలిచ్చారని, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు ప్రజలను నమ్మించి మోసం చేశారని... రానున్న ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్పాలని కోరారు.

ముగిసిన తల్లి పాల వారోత్సవాలు



నెహ్రూనగర్‌లో తల్లి పాల వారోత్సవాల ర్యాలీలో అంగన్‌వాడీ కార్యకర్తలు



తల్లిపాల విశిష్టతను తెలుపుతూ బ్యానర్లు ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీలు, విద్యార్థినులు

ఆరిలోవ : అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న తల్లి పాల వారోత్సవాలు గురువారం ముగిశాయి. ఆరిలోవ, ఆదర్శనగర్, విశాలాక్షినగర్, పెదగదిలి, చినగదిలి ప్రాంతాల కేంద్రాల్లో వారం రోజులపాటు తల్లి పాల ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాలు ఐసీడీఎస్ సీడీపీవోలు, ఏసీడీపీవోలు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముగింపు ఉత్సవాల సందర్భంగా పన్నెండో వార్డు పరిధి నెహ్రూనగర్ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. తల్లిపాల ప్రాధాన్యత, బాలింతలకు బేబీ ఫీడింగ్, తల్లి ముర్రుపాలలో ఉండే పోషకాలు తదితర వాటి గురించి వివరించారు. కేంద్రం సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, సచివాల య మహిళా పోలీస్, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ : తల్లిపాల వారోత్సవాలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో లాసన్స్ బే కాలనీలోని పెదవాల్తేర్ – 2 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అవగాహన కల్పించారు. అనంతరం ప్రత్యేకంగా రూపొందించిన ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వినిషా, మెడికో సోషల్ వర్కర్ కిరణ్‌కుమార్, డాక్టర్ శకుంతలా దేవి తదితరులు మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు ఆరోగ్యంతోపాటు సంపూర్ణ పోషకాలు, విటమిన్స్, మినరల్స్, ప్రోటీన్స్ అందిస్తాయన్నారు. తల్లి పాలు తాగిన చిన్నారులు అవసరమైన బరువు ఉండటంతోపాటు అనారోగ్యం బారిన పడకుండా ఉంటారన్నారు. తల్లులందరూ తప్పనిసరిగా వారి బిడ్డలకు తల్లి పాలు అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రాధిక, అజీదా, పలువురు ఏఎన్ఎంలు, కేర్ వాల్తేర్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్‌పై విద్యార్థుల్లో ఆసక్తి పెంచాలి



మాట్లాడుతున్న ఆర్జేడీ విజయభాస్కర్

ఆరిలోవ : ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించాలని జోన్ – 1 రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) బి.విజయభాస్కర్ సూచించారు. డీఈవో కార్యాలయం ఆవరణలోని శిక్షణ కేంద్రంలో రెండు రోజులపాటు నిర్వహించిన ఇన్‌స్పైయిర్ మనక్ – 2025 సైన్స్ ఉపాధ్యాయుల శిక్షణ గురువారం ముగిసింది. జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సైన్స్ ఉపాధ్యాయులు సుమారు 100 మంది శిక్షణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ సైన్స్ పట్ల విద్యార్థులకు ఆసక్తి రేకెత్తించే విధంగా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలన్నారు. సైన్స్ పట్ల విద్యార్థులకు అభిరుచి కల్పించాలన్నారు. సైన్స్ ఫెయిర్‌లో ప్రాజెక్టులు తయారుచేసి ప్రదర్శించడం వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. విద్యార్థులు ద్వారా మంచి ప్రాజెక్టులు నామినేట్ చేసే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం డీఈవో ఎస్.ప్రేమకుమార్ మాట్లాడుతూ జిల్లా నుంచి అత్యధిక సంఖ్యలో ప్రాజెక్టులు నామినేట్ అయ్యేవిధంగా విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. జాతీయ స్థాయిలో విశాఖ జిల్లా విద్యార్థులు పాల్గొనేటట్లు ఉపాధ్యాయులు కృషి చేసి వారికి తగిన మార్గదర్శకత్వం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ జె.చంద్రశేఖర్‌రావు, ఉప విద్యాశాఖాధికారి సోమేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి పి.రాజారావు, రిసోర్స్‌పర్సన్స్ టి.వి.ఎస్.చంద్రాజీరావు, సూర్యనారాయణ, జానకిరామ్ పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం నగరంలోని పెదగంట్యాడకు చెందిన సంపంగి ఈశ్వరరావు లక్ష రూపాయల విరాళం అందజేశారు. సింహగిరిపై పీఆర్‌వో కార్యాలయంలో చెక్కుని ప్రోటోకాల్ విభాగం సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు అందజేశారు.